# క్వారీ – గోరీ

‘కథలో మీ హృదయం వ్యక్తమయింది.’

కాగితాలకట్ట ఆక్తరున్నీసాబేగంకి అందించాడు సుందర రామమూర్తి.

‘మీ మనస్సు ఎటు మొగ్గివుందో స్పష్టంగా తెలుసుకొన్నాను.’

కళ్లలోకి చూస్తూ చెప్పాడు ఆడమ్స్. ఆ కథ అంతకుముందే చదివాడు.

‘ముగ్గురూ యూనివర్సిటీ స్టూడెంట్స్.’

రాత్రి ఎనిమిది గంటలప్పుడు నౌబత్ పహాడ్ మీద కూర్చుని వున్నారు. హైద్రాబాద్‌లో.

రచయిత్రి ఆక్తరున్నీసాబేగం, విద్యుద్దీపాల వెలుతురులో తేలికగా, విలాసంగా కూర్చున్న! ఆమె బఠానీలు ఒక్కొక్క గింజా తింటూవుంది.

‘అంటే ఏమిటి?’ బఠానీగింజ కొరికి ఇద్దరినీ చూచి అడిగింది.

‘నేను చెప్పనక్కర్లేదు. కథాహృదయం మీకే తెలుసు’ ఆడమ్స్.

‘ఇంతకుముందు తెలియకపోతే కథ మరొక్కమారు మీరే చదువుకొంటే మీ మనస్సు ఎటు మొగ్గిందో మీకే తెలుస్తుది’ సుందరరామమూర్తి.

'అయితే చదువుతాను.'

బతానీలు కొరుకుతూ మొదలుపెట్టింది.

చిలగడదుంపమీది బొప్పుల్లాగా వున్నాయి కొండలు పచ్చటి చెట్లతోవున్న పర్వతప్రాంతం ఆకాశానికి ఆకుపచ్చ రంగు ఆచ్ఛాదించింది.

నిశ్శబ్దంగావున్న లోయలో ఆకాశం వురిమినట్లు ధ్వని ప్రతిధ్వనులు. కొండపగిలి పెళ్లులేచి చెట్లు మీదపడి కొమ్మలు విరగ్గొట్టి ఆకులు చితగ్గొట్టి నేలమీదపడితే పనివాళ్లు పగ గొట్టి చిన్నచిన్న రాళ్లు వేరు చేస్తున్నారు.

అక్కడా పనిచేయిస్తున్న వ్యక్తి రాంకోటి. ఆ రాళ్లతో వెళుతున్న లారీ పర్వతప్రాంతంలో నడవలేక నడవలేక నిండు చూలాలులాగా వుంది.

ఆ లారీ సమాధిముందు ఆగింది. సమాధిమీద రంగు రంగుల గాజు పలకలతో త్రికోణంగా పిరమిడ్స్‌ను తలపించే కట్టడం తయారయింది. దానికి రక్షణగా చుట్టూ కట్టవలసిన రాతి నిర్మాణం ప్రారంభమయింది.

గాజుపలకల త్రికోణంవైపు చూస్తూ రాళ్లకు చేరగిలబడి నేలమీద కూర్చున్న ఆలీఖాన్ పిచ్చివాడులాగా వున్నాడు కళ్లు గుంటలు పడ్డాయి, తల రేగిపోయింది. బట్టలు చిరిగి పోయాయి. తలకు సంస్కారం లేదు. కళ్లు నిద్రమత్తుగా వున్నాయి. ముక్కుపుటాబూ అధరాలూ అదురుతున్నాయి

'నూర్జహాన్.'

అస్పష్టంగా గొణిగాడు. కళ్లవెంట అశ్రుపాతం! ముఖంలో మార్పు శరీరం వణికింది.

సూర్యుడు నడునెత్తిమీద వున్నాడు. సంవత్సరంనుంచి అతన్ని ఎండగాని, వానగాని, తాకలేకపోయింది. అచలంగా వున్నాడు.

'వచ్చే ఆదివారంతో సంవత్సరం నిండిపోతుంది' నెమ్మదిగా గొణిగాడు.

పని పూర్తి అయ్యేట్లు కనిపించడం లేదు.

దగ్గరలోవున్న ఒక పూవుమీద రెండు తుమ్మెదలు వాలటానికి ప్రయత్నిస్తున్నాయి.

అది చూచి ఆలీఖాన్ స్తంభించిపోయాడు. రెండు కన్నీటి బిందువులు అప్రయత్నంగా జారి నేలమీదపడి మంటలో ఇంకిపోయాయి.

రంగుటద్దాల త్రికోణం దగ్గరకు పోయాడు.

సూర్యకిరణాలు పడి అద్దాలు మెరుస్తున్నాయి. అద్దాలలో తన ప్రతిబింబం కనబడుతూవుంది. తన నీడలో ఎవరో కదిలినట్లయింది.

తనువు పులకించింది. హృదయంలో పాలవెల్లి. పాలవెల్లిపై వెన్నెల!

'ఆలీ!'

ఎవరో పిలిచారు.

అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. అద్దాల మీద తెల్లని పొడ!

'ఆలీ!'

పూవువంటి పొడ పిలిచింది. సుకుమార స్వరం హృదయంలో ఆవేశం.

'నూర్జహాన్!' పెద్దగా అరిచాడు. మెల్లగా ఉచ్చరించాడు. పొడ కదులుతూవుంది. పొడి రూపు దాల్చింది. నూర్జహాన్ అయింది. మొగ్గల చిరునవ్వుతో తూలపోయే లేత తీగలాగ వచ్చింది. ఆలీఖాన్‌ను ఆలింగనం చేసుకొంది.

ఆమె శరీరం చిగురుటాకులాగా వుంది. జుత్తు చిరుగాలి లాగా వుంది. కనులు మూసుకొన్నాడు. ఆమె చేతుల్లోంచి జారిపోయింది. కల కరిగినట్లు అయింది. అమృతం జారినట్లుంది.

'నూర్జహాన్.'

ఆలీ పిలిచాడు. ఆమె అద్దాలవెనుక నిలచింది.

వానా గాలీ వచ్చి ఉద్యానవనంలో పాదు నంటుకొనివున్న తీగతెగి, రాలి క్రిందపడి గాలిలో తేలి, ఆకాశంలో ప్రయాణంచేసి, నేలమీదపడి, ఆలీఖాన్ కాలికి చుట్టుకొంది ఆ తీవను తీసుకుపోయి, తన పూదోటలో నాటుకొని తనే పందిరి అయి ప్రాణప్రదంగా పెంచుకున్నాడు.

నూర్జహాన్ మరొక అద్దంలో వయ్యారంగా నిలబడింది.

పూల పందిరిక్రింద జిలుగు జలతారు ముసుగు పరదాల లోపల సానబెట్టిన రత్నం కాంతులు వెదజల్లినట్లు అరవిరిసిన పూవు పరిమళం అందించినట్లు, చంద్రబింబం లేత కౌముది కురిపించినట్లు విద్యుత్తులాగా ఉత్సాహంతో వెలిగి, పన్నీరు లాగా శరీరంలోన ప్రవహించి, అమృతంలాగా అధరాలకు ఆనందం అందించింది. నూర్జహాన్ మరొక అద్దంలో నవ్వుతూ వుంది.

పందిరి మంచంమీద పూల మాలికల తెరలమధ్య వెలుగు కళికలాగా, జిలుగు నీలిరంగు దుప్పటి మధ్య మెరుపులాగా

తన తనువును వీణచేసుకొని స్వర్గంనాథుని రసధ్వనులు ప్రవహింపజేసినట్లుగా సోలపోయింది.

అందీ అందని అందాల ఆనందంలాగా ఆమె మరో అద్దంలో విలాసంగా నిలిచింది.

'పచ్చని గరిక తివాసీమీద సెలయేటి ఒడ్డున స్వర్గం అరచేతిలో దాచుకొన్న సుందర గంధర్వ భామినిలాగా ఆ లోగుండెలలోకి మెట్లు మెట్లుగా నడిచింది.

మేడమీద పూర్ణిమనాడు వెన్నెల అంతా మూర్తి గొల్పిన సౌందర్యరాశి హస్తాలలో అలంకారంగా తొణికిసలాడే పాన పాత్రలో యౌవ్వనం తొణికిసలాడే భామిని మధువు అందిస్తుంటే వెన్నెలే కరిగి కంఠంలో ప్రవేశించినట్లున్న వేళ తనువు గాలిలో తేలుతున్న సమయాన, గాలిలో తేలిపోతున్నట్లు వచ్చి చేరువ అయిన ఆమెను తూలిపోతున్న చేతులతో తాకబోతే, మధిరామత్తత ముగియకముందే, మధిరామత్త నేత్రాలు మూతలుపడి, మధిరాహస్త మత్తరాశిని, మధిరాపాత్రలో వ్రాలి నేలమీదపడి పగిలిపోయింది.

'నూర్జహాన్' ఆలీఖాన్ బిగ్గరగా అరిచాడు. అద్దాల అంతర్యంలాగా, దర్పణాల వెనుకనుంచి, చిరుగజ్జెల సవ్వడులతో గాలిలో లేచి గలగలా వచ్చింది, నూర్జహాన్.

పూలసువాసనను, వెన్నెలచల్లదనాన్ని, అద్దాల స్వచ్ఛతను, పట్టుకొన్నట్టు ఆమెను పట్టుకొన్నాడు ఆలీ. తన్మయత్వంతో అక్కడే అలాగే ఎంతోసేపు ఉండిపోయాడు.

'రాళ్లు రాలేదు'.

మేస్త్రీ చెప్పాడు.

ఆలీఖాన్ స్వప్న లోకంలోంచి ఈ లోకానికి వచ్చాడు. 'రాంకోటికి కబురు పంపలేదా' ప్రశ్నించాడు.

'పంపాను ఆయన అక్కడ లేరు. ఇంటికి పోయారట.'

'సరే! ఆదివారానికి పూర్తికావాలి కట్టడం.'

'రాళ్లు సకాలంలో అందితే' అంటూ తలవూపాడు మేస్త్రీ.'

'నేను రాంకోటి దగ్గరకు వెడుతున్నాను. ముందుకు నడిచాడు. చెట్టు నీడలోవున్న కారెక్కాడు బయలుదేరింది. కారు విశాలభవనం ముందాగింది.

తలుపుదగ్గరకు పోయాడు ఆలీ. వేసివుంది. తట్టాడు. తలుపు తీయలేదు. తట్టాడు. సమాధానం లేదు. 'రాంకోట్! రాంకోట్!' పిలిచాడు.

లోపల సన్నని కంఠం ఎవరో వచ్చారు. ఆయన్ను పిలుస్తున్నారు. లేరని చెప్పు అనటం వినిపించింది.

ఏవో పాత జ్ఞాపకాలు తెరలు తొలగి లీలగా ఆ కంఠస్వరం వ్యక్తి గుర్తుకు వస్తూవుంది.

పనిమనిషి తలుపుతీసి 'వారు లేరు' అని చెప్పేలోగా హాలు మధ్యలో పమిట చెంగు ముసుగు వేసుకొన్న మూర్తిని అవ్యక్తంగా చూచాడు. తలుపు పడింది.

ఆమె — ఆమె — ఎక్కడో చూచినట్టుందామెను. పూర్వ జన్మమో, గతమో జ్ఞాపకం వచ్చినట్లుంది. మళ్లీ తలుపుతట్టాడు.

తలుపు తెరుచుకొంది. వింతగా చూస్తున్న పనిమనిషిని గమనించకుండా లోపలికి వెళ్లాడు ఆలీ. హాలులో పోతపోసిన విగ్రహంలాగా ఉన్న ముసుగుకప్పుకొన్న ఆమె దగ్గరకు పసిపిల్లాడు చిందాడుతూ వెళ్లినట్లు వెళ్లాడు.

'నువ్వు! నువ్వు! నువ్వు!'

అటు తిరిగివున్న ఆమె ఆ స్వరం విని ముఖం చూచి, 'ఆఁ!' అంది, వెండికొంగ వెన్నెలమీద జారిపడ్డట్లు.

పొగ మంచులోంచి కనిపించే ముఖంలాగా వుంది ఆమె ముఖం ముసుగ లోపట్నించి.

'నువ్వు సుజాతవు కదూ!'

ఆవేశంగా అడిగాడు ఆలీ.

'అవును!'

'నిజంగానా? నిజంగానా సుజాతా?'

'ఆఁ!'

'నువ్వు చనిపోలేదూ?'

'లేదు!'

'అయితే నన్నెందుకు మోసం చేశావ్'

'నేనేమీ చేయలేదు'

'నువ్వు నదిలో కొట్టుకుపోలేదా!'

'ఆఁ!'

'మరి చనిపోలేదా!'

నవ్వింది. 'రాంకోటి బ్రతికించాడు.'

'సుజాతా!'

దగ్గరకు పోబోయాడు.

'దూరంగా వుండు'

'సుజాతా!' బాధగా అరిచాడు.

'నేను పరాధీనను'

'కావచ్చు. కావచ్చు సుజాతా, నువ్వు నాదానివి.'

'ఒకప్పుడు. ఇప్పుడు కాదు.' వెళ్లు.

'అంతేనా?'

అంతే!

ఆలీ తల వంగిపోయింది. నెమ్మదిగా వెలుపలి నడుస్తున్నాడు.

'ఆలీ!'

ఆగిపోయాడు.

'ఆలీ!'

ఆమె దగ్గరకు వచ్చింది.

'ఇప్పటికి నిన్ను ప్రేమిస్తున్నాను'

'నిజంగానా?'

'ఆః! — అయితే నేను రాంకోటి భార్యను.'

ఆమె చరచరా లోపలికి పోయింది.

'సుజాతా!'

ఆమె వినిపించుకోలేదు. మెట్లు ఎక్కింది.

'సుజాతా!'

ఆమె వెళ్లిపోయింది.

ఆలీ వెళ్లాడు. మెట్లు ఎక్కాడు.

ఆమె ఏ గదిలోకి వెళ్లిందో తెలియలేదు. వెదుకుతున్నాడ ప్రక్కగదిలో ఉల్లిపొర తెర చీర చెరగులా కదులుతూ వుం ఆలీ ఆ గదిలోకి పోబోయాడు.

దూరంగా వివస్త్రగా స్త్రీ!

నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ప్రశాంతంగా తెల్లని చాందీ!

'సుజాతా?'

పిలిచాడు. ఆమె వినలేదు. రెండడుగులు వేశాడు. ఆమె సుజాతా కాదు. అయితే! అయితే! ఆమె ముఖం చూశాడు. పరిచిత! బట్టలు కట్టుకోలేదు.

'నూర్జహాన్!'

అరిచాడు. ఆమె తలవూపింది. సిగ్గు పడటంలేదు. నిర్భీతిగా వుంది.

'ఇక్కడెందుకున్నావ్?'

మాట్లాడలేదు. కదలలేదు.

'చెప్పు! ఎందుకున్నావ్? చెప్పవేం?'

చెప్పలేదు. కదలలేదు. గాలీ పీల్చటంలేదు. నగ్నంగావుంది.

'చెప్పు'

మృదువుగా తాకాడు. కఠినంగా చల్లగా స్పర్శ.

'అది పాలరాతి బొమ్మ.'

వెలుపలనుంచి సన్నని కంఠస్వరం. ఆమె సుజాత.

'కాదు! కాదు! కాదు! — ఈమె నూర్జహాన్. నా నూర్జహాన్.

'ఆ గదిలోంచి వెళ్లిపోవాలి. రాంకోటి ఎవరినీ ఆ గదిలోకి రానివ్వడు. నేనూ వెళ్లలేదు. ఎప్పుడూ బైటికి వెళుతూ తాళంవేసి వెళతాడు. ఇవాళ వేయలేదు. ఇవాళే మొదటిసారి ఆ గదిలోకి నేను వెళ్లాను. బాధపడ్డాను. అయినా నేను రాంకోటి భార్యను. వెళ్లిపోవాలి.'

ఆలీఖాన్ క్రుంగిపోయాడు.

'వెళ్లు'

వెళ్లాలా?'

'తప్పక'

'వస్తాను'

ఆలీఖాన్ ముఖంలో ద్వివిధ విచారంవల్ల ప్రేతకల పడింది

'ప్రేమించే హృదయం మరణించదు.'

వెనుకనుంచి, ఉల్లిపొర తెర వెనుకనుంచి, ఉల్లిపొరవంటి ముసుగు వేసుకొన్న సుజాత చెబుతూవుంది. ఆలీ మెట్లు దిగాడు. కళ్లు నీళ్ల కుండలయ్యాయి.

హాలులోంచి వెళుతున్న ఆలీఖాన్ తలమీద పైనుంచి నీళ్లబొట్లు పడ్డాయి. పైకిచూస్తే కళ్లు తుడుచుకొంటూ సుజాత.

కారులో లారీలు ఆగే పర్వత ప్రాంతంలోకి వచ్చాడు.

'రాంకోట్! రాంకోట్!'

లోయ ప్రతిధ్వనించింది.

రెండు రోజుల్నుంచి కొండ పగలలేదు. డైనమైట్ అయిదు సార్లు పెట్టారు. చివరికి ఆఖోసారి ఎక్కువ మందు పెట్టి దూరంగా కూర్చున్నారు క్వారీ జనం,

'రాంకోట్!'

ఆలీఖాన్ లోయలోకి వచ్చాడు.

'రాంకోట్!'

కేకలు పెడుతూ ప్రమాద ప్రాంతంలోకి వెళ్లాడు.

రాంకోటి ఆలీఖాన్‌ను చూస్తూనే వున్నాడు చెట్టు క్రింద నుంచి.

'పిలవండి' ప్రక్కనున్న వాళ్లు సలహా ఇచ్చారు.

'పోనీండి, పిలవ్వద్దు'

'ప్రమాదం జరగవచ్చు.'

'చావనీండి!'

'రాయితోలిండబ్బు...'

'సమాధి కట్టడానికి నేను రాయితోలింది డబ్బు నాశించి కాదు. డబ్బు నాకక్కరలేదు.' నెమ్మదిగా అస్పష్టంగా చెప్పాడు. 'నా హృదయానికి శాంతి.'

డైనమైట్ పేలింది. కొండ పగిలింది. రాళ్లు పెల్లలు పెల్లలుగా ఆకాశంలోకి లేచాయి. మళ్లీ పేలింది. పెద్దరాతి పెళ్ల లేచింది. అది చూడగానే రాంకోటి గుండె జలదరించింది. అది వచ్చి చెట్టుమీద పడింది. రాతిపెళ్ల నేలకు అతుక్కుపోయింది. రాంకోటి ఆఖరిఘడియల్లో పెట్టిన చావు కేక 'ఆలీ!' వినిపించింది కాని మనిషి కనిపించలేదు.

'రాంకోట్!'

కేకలుపెడుతూ పిలుపు వినిపించిన దిక్కుకు పరుగెత్తాడు. వికృతంగా రాంకోటి కనిపించాడు. బాధ కలిగింది. అచేతనంగా నిలబడ్డాడు.

మళ్లీ కొండ పగిలింది. రాతిపెళ్ల లేచింది. తిన్నగా వెళ్లి సమాధి మీద పడింది.

'నూర్జహాన్'

లోయ ప్రతిధ్వనించింది. ఆకాశం మారుమ్రోగింది.

'ఆలీ!'

దూరంనుంచి పిలుపు చెట్లమధ్యగా వినిపించింది.

‘నూర్జహాన్!’

సమాధిదగ్గరకు పరుగెత్తాడు.

‘ఆలీ!’

సమాధి రంగుటద్దాలు పప్పు పప్పుగా పగిలిపోయాయి. గుండె ముక్కలయినట్టు విలవిల లాడాడు. సమాధిమీద రాయి మూతపడింది.

‘ఆలీ!’

వెనుకనుంచి పిలుపు.

లేచి నిలబడ్డాడు. వినిపించింది. వెనుకనుంచి ప్రతిధ్వని. వెనక్కు చూశాడు.

‘ఆలీ!’

‘వస్తున్నా! వస్తున్నా నూర్జహాన్’

వెనక్కు గబగబా చకచక బయలుదేరాడు. పరుగెత్తాడు.

‘ఆలీ!’

ఎదురుగా పూలు! పూల వెనుక పూవువంటి స్త్రీ!

‘ఎవరునువ్వు?’

‘నేను!’

‘అంటే! ఎవరునువ్వు?’

‘పోల్చుకోలేదా?’

‘లేదు! నువ్వెందుకున్నా విక్కడ?’

‘నీకోసం!’

‘నాకోసమా’

దగ్గరకుపోయాడు.

‘దూరంగా వుండు’

‘ఎందుకు?’

‘ఎవర్ని నేను?’

‘పోల్చుకొన్నాను. సుజాతవు!’

‘అంతేకాదు! పరస్త్రీని — పరాధీనను. రాంకోటి భార్యను’

‘ఎందుకొచ్చావేం?’

‘రాంకోటి చేయించుకొన్న నీ నూర్జహాన్ పాలరాతి విగ్రహాన్ని నీకివ్వటానికి’

‘ఇవ్వు!’

‘నడూ’

‘ఎక్కడుంది?’

‘కారులో’

ఇద్దరూ కారుదగ్గరకు నడుస్తున్నారు.

‘రాంకోటి చనిపోయాడు.’

ఆమె వణికిపోయింది. ‘ఎందుకు?’ ప్రశ్నించింది. చెప్పాడు.

ఆమె వెనుదిరగబోయింది.

‘ఆగు!’

‘ఎందుకు?’

‘నా నూర్జహాన్ విగ్రహం నాకివ్వు’

‘ఇస్తాను’

ముందుకు నడుస్తున్నారు.

‘సమాధి నాశనమయింది!’

‘ఎందుకు?’

‘నీకే తెలియాలి!’

'ఎలా?'

చెప్పాడు. ఆమె ఆగిపోయింది.

'నా నూర్జహాన్ పాలరాతి విగ్రహం నాకివ్వు'

'ఇస్తాను!'

ఆమె ముందుకు నడిచింది.

'ఎందు తెచ్చావది?'

'నీ కివ్వాలని'

'ఎందుకివ్వాలది నాకు?'

'నీది నీకు ఇవ్వాలి కాబట్టి'

'నీది నాకు ఇస్తావా?'

'ఇస్తాను'

కొండ పగిలింది. పెద్ద పెళ్ల లేచింది.

'కారులో వుంది తీసుకో'

ఆలీఖాన్ సుజాత కారుదగ్గరకు పోయాడు. రాతిపెళ్ల కారు మీద పడింది. కారులోంచి విగ్రహం తల పగిలి నేలమీద పడింది.

'నూర్జహాన్!'

గగ్గోలెత్తుతూ కేకలు పెట్టాడు.

'సుజాతా! నా నూర్జహాన్!'

'పగిలింది!'

'సుజాతా!'

'ఆలీ!'

'సుజాతా!'

'ఆలీ!'

'నా నూర్జహాన్ పాలరాతి విగ్రహం నాకివ్వు! ఇవ్వు సుజాతా!

'ఇస్తాను ఆలీ! నేనే ఇస్తాను! ఇస్తాను! ఇప్పుడే ఇస్తాను!'

కథ చదవటం ముగించిన ఆక్తరున్నీసాబేగంకి హృదయం ఏమిటో, మొగ్గటం ఏమిటో అర్థమయింది. దగ్గరలో కూర్చుని ఆమె కళ్లలోకి చూస్తూ వున్నాడు ఆడమ్స్.

దూరంగా చుక్కల అవల అనంతలోకి చూస్తున్నాడు సుందరరామమూర్తి.

శుభం